

సాక్షి రంగారెడ్డి

శనివారం । 9 । మార్చి । 2024



ముంచుకొస్తున్న గడువు

పీఏసీఎస్‌లో రుణాలు పొందిన రైతులు బకాయిలు చెల్లించాలని అధికారులు కోరుతున్నారు.

8లో▸



మహేశ్వరం: శివగంగ ఆలయంలో స్వామివారి దర్శనానికి క్యూలైన్‌లో వెళ్తున్న భక్తులు



యాచారం: నందివనపర్తిలో నందీశ్వరుడిని దర్శించుకోవడానికి బారులు తీరిన భక్తులు



హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ చౌడీ వద్ద శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

ఓం నమః శివాయ

మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు క్యూ కట్టారు. స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎక్కడ చూసినా సందడి వాతావరణం కనిపించింది. ఆయా ఆలయాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

న్యూస్‌రీల్

మహిళలకు ఉచిత శిక్షణ

వికారాబాద్ అర్బన్: యూనియన్ బ్యాంక్ గ్రామీణ ఉపాధి శిక్షణ సంస్థ, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, స్వర్ణ భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామీణ మహిళలకు చిరు వ్యాపారాలపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ సంచాలకుడు జీ.ఎస్.ఆర్.కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పచ్చళ్లు, కారం పొడులు, తృణ ధాన్యాలతో స్నాక్స్ తయారు చేయడం వంటి వాటిపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు చెప్పారు. 19 నుంచి 45 సంవత్సరాల లోపు వారు అర్హులన్నారు. 10రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 93914 87797, 9177141712, 96185 34720 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బైక్ ఢీకొని కొండగొర్రె మృతి

ధారూరు: బైక్ ఢీ కొనడంతో కొండగొర్రె మృతి చెందిన ఘటన మండలంలోని తాండూరు - హైదరాబాద్ ప్రధాన రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. అనంతగిరి అటవీ ప్రాంతం నుంచి కొండగొర్రె రోడ్డుపైకి వచ్చింది. వాహనాల రాకపోకలకు భీతిల్లిన ధారూరు వైపు పరుగులు తీసింది. కొందరు యువకులు దాన్ని అనుసరిస్తూ వీడియోలు తీశారు. ధారూరు సమీపంలోని వంతెన రోడ్డులో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని బైక్ బలంగా కొండగొర్రెను ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది.

‘బస్తీ’కి సుస్తీ!

నిర్వహణ కరువైన బస్తీ దవాఖానాలు

- దాతలు దయ తలిస్తేనే చీపుళ్లు, ఫినాయిల్
- సకాలంలో వేతనాలు అందక సిబ్బంది ఇబ్బంది
- ఆస్పత్రులను వీడుతున్న వైనం
- రోగులకు అందని వైద్య సేవలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: బస్తీ దవాఖానాలకు సుస్తీ చేసింది. ఆహ్లాదకరమైన వాతావరణంలో రోగులకు ఆరోగ్యాన్ని పంచాల్సిన ఆయా ఆస్పత్రులు నిర్వహ ణ లోపంతో ఎటు చూసినా.. దుమ్ముధూళితో దర్శనమిస్తున్నాయి. నిర్వహణకు ప్రభుత్వం నిధులు కేటాయించక పోవడంతో ఆయా ఆస్పత్రుల్లో పని చేస్తున్న వైద్య సిబ్బంది చిన్నచిన్న అవసరాలకు బస్తీల్లోని దాతలపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఎవరైనా దయతలిచి చీపుర్లు.. ఫినాయిల్ ఇప్పిస్తే సరి లేదంటే అంతే. విధిలేని పరిస్థితుల్లో రోగుల నుంచి ఎంతో కొంత వసూలు చేసి, అవసరాలు తీర్చుకోవాల్సి వస్తోంది. కనీస మౌలిక సదుపాయాలు, శుభ్రత లేని ఈ బస్తీ/పల్లె దవాఖానాల్లో పని చేసేందుకు యువ వైద్యులు విముఖత చూపుతున్నారు. విధుల్లో చేరిన కొద్ది రోజులకే చెప్పాపెట్టకుండా మానేస్తున్నారు. దీంతో స్టాఫ్ నర్సులే రోగులకు పెద్ద దిక్కుగా మారుతున్నారు.

ఊడ్చాలన్నా.. తూడ్చాలన్నా..

దగ్గు, జలుబు, తలనొప్పి, జ్వరం, మధుమేహం, అధిక రక్తపోటు వంటి సాధారణ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో 2019 ఫిబ్రవరిలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ బస్తీదవాఖానాలు/ పల్లె దవాఖానాలు ఏర్పాటు చేసింది. జిల్లా వ్యాప్తంగా 81 మంజూరు కాగా, వీటిలో ప్రస్తుతం 71 పని చేస్తున్నాయి. పలు ప్రభుత్వ భవనాలు, కమ్యూనిటీ హాళ్లలో వీటిని ఏర్పాటు చేసింది. ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఒక్కో కేంద్రంలో ఎంబీబీఎస్ డాక్టర్ సహా స్టాఫ్ నర్సు, ఫార్మాసిస్టు, సపోర్టింగ్ స్టాఫ్‌ను నియమించింది. ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులను పరీక్షించి, వారికి అవసరమైన మందులు ఇవ్వడంతో పాటు వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో భాగంగా రక్త, మూత్ర పరీక్షలు చేస్తున్నారు. రోగుల నుంచి నమూనాలు సేకరించి తెలంగాణ డయాగ్నోస్టిక్‌కు పంపుతున్నారు. వీటికి పేద ప్రజల నుంచి మంచి స్పందన కూడా లభిస్తోంది. అయితే వీటి నిర్వహణ అంశాన్ని ప్రభుత్వం గాలికొదిలేసింది. మూడేళ్లుగా కనీస నిధులు మంజూరు చేయడం లేదు. దీంతో జిల్లాలోని ఏ ఒక్క దవాఖానలోనూ చీపుర్లు లేవు, ఫినాయిల్ లేవు. ఉన్న వాటిలోనూ రోగులు, దాతలు సమకూర్చినవే. దవాఖానాల నిర్వహణలో భాగంగా ఒక్కో కేంద్రానికి ఏటా రూ.50 వేల వరకు చెల్లించనున్నట్లు ప్రకటించింది. కానీ ఇప్పటి వరకు ఏ ఒక్క ఆరోగ్య కేంద్రానికి చెల్లించిన దాఖలాలు లేవు. విధిలేని పరిస్థితుల్లో ఆయా ఆస్పత్రుల్లోని సిబ్బంది బస్తీల్లోని నేతలు, ఇతర దాతల వద్ద చేయి చాచాల్సి వస్తోంది.



ఎవరి ఖాతాల్లోకి ఆ నిధులు?

నిజానికి ప్రభుత్వం ఏటా బడ్జెట్‌లో బస్తీ దవాఖానాలకు నిధులు కేటాయిస్తుంది. ప్రతీ నెల మెయింటెనెన్స్ చార్జీలు కూడా చెల్లిస్తున్నట్లు చెబుతోంది. కానీ క్షేత్రస్థాయిలోని పరిస్థితులు మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. 2019 నుంచి ఇప్పటి వరకు ఏ ఒక్క దవఖానాకు కూడా ఈ నిధులు అందలేదు. ఒక వేళ నిధులు మంజూరైతే అవి ఎవరి ఖాతాల్లోకి మళ్లాయో తేలాల్సి ఉంది. అంతేకాదు ప్రస్తుతం మెజార్టీ ఆస్పత్రుల్లో వైద్యులు లేరు. ఉన్నట్లు తప్పుడు అటెండెన్స్ రిజిస్టర్లు చూపించి, వారి పేరున నెలవారీ వేతన బిల్లులు డ్రా చేసినట్లు ఆరోపణలున్నాయి. పట్టణ ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని ఉన్నతాధికారుల వరకు వాటాలు వెళ్లినట్లు తెలిసింది. రక్తనమూనాలు సేకరించేందుకు ల్యాబ్ టెక్నీషియన్లు లేకపోవడంతో ఆ పనులను స్టాఫ్ నర్సులే చేయాల్సి వస్తోంది. ఫార్మాసిస్టులు కూడా లేకపోవడంతో ఆ పనులు కూడా వారే నిర్వర్తించాల్సి వస్తోంది.

కండ్లకోయకు నేడు సీఎం రేవంత్

- మేడ్చల్ జిల్లా నుంచి కాంగ్రెస్ శంఖారావం
- శంకుస్థాపనలు.. మహిళలతో ముఖాముఖి
- అధికారిక కార్యక్రమాలకు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

సాక్షి, మేడ్చల్ జిల్లా/మేడ్చల్: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రేవంత్‌రెడ్డి మొదటిసారిగా మేడ్చల్ జిల్లాలో శనివారం పర్యటిస్తున్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపనలు చేస్తారు. పొదుపు సంఘాల మహిళలతో ముఖాముఖి చర్చలు నిర్వహించనున్నారు. కండ్లకోయ(గుండ్లపోచంపల్లి హనుమాన్ గడ్డ) వద్ద ఏర్పాటు చేసిన బహిరంగసభలో సీఎం రేవంత్ ప్రసంగించనున్నారు.

పర్యటన ఇలా.. సాయంత్రం ఐదు గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి కండ్లకోయ ఐటీ కారిడార్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు హాజరుకానున్నారు. 44వ జాతీయ రహదారిపై నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ పనులకు శంకుస్థాపన చేస్తారు.

- పొదుపు సంఘాల మహిళతో అక్కడే సమావేశమై 20 నిమిషాల పాటు మాట్లాడతారు. సంఘాల నిర్వహణ, లాభ నష్టాలు వంటి అంశాలపై వారితో చర్చిస్తారు. ఈ కార్యక్రమంలో 600 మహిళా సంఘాలు సభ్యులు పాల్గొనేలా అధికారయంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఈ ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ పరిశీలించారు.

కాంగ్రెస్ శంఖారావ సభ..

గుండ్లపోచంపల్లి (కండ్లకోయ)హనుమాన్ గడ్డ వద్ద కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల శంఖారావం బహిరంగసభ ఏర్పాటు చేసింది. ఈ సభలో 6 నుంచి 8 గంటల వరకు సీఎం ఉంటారు. అక్కడే ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తల చేరికలు, ప్రసంగాలు ఉంటాయని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.

అధికారిక కార్యక్రమాలకు ఏర్పాట్లు పూర్తి

కండ్లకోయ వద్ద శంఖుస్థాపనలకు, ముఖ్యమంత్రి మహిళలతో చర్చలకు కావాల్సిన ఏర్పాట్లు జిల్లా కలెక్టర్ గౌతమ్ దగ్గరుండి పూర్తి చేయించారు. మహిళలు కూర్చునేందుకు భారీ వేదిక ఏర్పాటు చేశారు.

సభ విజయవంతంపై నేతల దృష్టి

గుండ్లపోచంపల్లి(కండ్లకోయ) వద్ద బహిరంగ సభ విజయవంతంపై శుక్రవారం కాంగ్రెస్ నాయకులు తోటకూరి వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, మలిపెద్ది సుధీర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్‌లు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. 50 వేల మంది కూర్చొనే విధంగా సభా వేదికను తీర్చిదిద్దారు. సభకు మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 50 వేల మంది ప్రజలను తరలించాలని కాంగ్రెస్ పార్టీ నేతలు సన్నాహాలు చేస్తున్నారు.

సీఎం పర్యటన 3 గంటలే..

సీఎం రేవంత్‌రెడ్డి మేడ్చల్ మండలంలో శుక్రవారం సాయంత్రం 5నుండి రాత్రి 8వరకు పర్యటిస్తారు. దీనికి ముందు ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని నల్లచెరువు వద్ద నిర్మించిన మురుగు నీటి శుద్ధి కేంద్రం(ఎస్‌టీపీ)ను ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ అధికారులు దానకిశోర్, జిల్లా కలెక్టర్ గౌతమ్ పాల్గొంటారు. ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి రోడ్డు మార్గాన ఓఆర్ఆర్ మీదుగా కండ్లకోయకు సాయంత్రం 5 గంటలకు చేరుకుని అక్కడ కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆరు గంటలకు బహిరంగసభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తారు. అనంతరం హైదరాబాద్ నగరానికి రోడ్డు మార్గంలో వెళ్తారు.

బైరామల్‌గూడ రెండో ఫ్లైఓవర్ ప్రారంభం నేడు

సాక్షి, సిటీబ్యూరో: ఎల్‌బీనగర్ పరిధిలోని బైరామల్‌గూడ జంక్షన్ వద్ద రెండో లెవెల్ ఫ్లైఓవర్ శనివారం ప్రారంభం కానుంది. సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి ఈ ఫ్లై ఓవర్‌ను ప్రారంభించనున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ తెలిపారు. ఈఫ్లైఓవర్ పొడవు 1.78 కి.మీ.లు. దీని నిర్మాణానికైన ఖర్చు రూ.140.05 కోట్లు. మూడు లేన్లుగా ఉన్న ఫ్లైఓవర్ వెడల్పు 12 మీటర్లు. ఈ ఫ్లైఓవర్ వినియోగంతో శంషాబాద్, ఒవైసీ హాస్పిటల్స్ వైపు నుంచి విజయవాడ, నాగార్జునసాగర్ వైపు వెళ్లే వారికి ట్రాఫిక్ తిప్పలు తప్పుతాయి. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ పాల్గొంటారు.

ఇద్దరు దొంగలు ఎస్కేప్?



- ప్రభుత్వ కార్యాలయాల్లో వరుస నేరాలు
- అదుపులోకి తీసుకున్న శివారు పోలీసులు
- రికవరీ కోసం ఓ ప్రాంతానికి తరలింపు
- అదును చూసుకుని పారిపోయిన ద్వయం

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ కార్యాలయాల్లో వరుస నేరాలు చేసి ఇద్దరు దొంగలు పోలీసులకు చిక్కినట్లే చిక్కి ఎస్కేప్ అయ్యారు. వీరిని పట్టుకున్న స్థానిక పోలీసులతో పాటు ప్రత్యేక విభాగాలకు చెందిన బృందాలు సైతం రంగంలోకి దిగి గాలిస్తున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. నగర శివార్లలో ఉన్న ఓ ప్రభుత్వ కార్యాలయంలో ఈ ఏడాది జనవరిలో చోరీ యత్నం చోటు చేసుకుంది. ఈ కేసు కొలిక్కిరాకుండానే గత నెల మరో కార్యాలయంలో చోరీ జరిగింది. దీంతో ఈ వ్యవహారాలను సీరియస్‌గా తీసుకున్న స్థానిక పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపాయి. రెండో నేరం చోటు చేసుకున్న కార్యాలయంలో సీసీ కెమెరాలు సైతం సరిగ్గా పని చేయకపోవడంతో ఆధారాల సేకరణ కష్టసాధ్యమైంది. ఈ కార్యాలయానికి సమీపంలో, చుట్టుపక్కల మార్గాల్లో ఉన్న సీసీ కెమెరాల్లో నమోదైన ఫీడ్ పరిశీలించిన అధికారులు ప్రాథమిక ఆధారాలు సేకరించారు. వీటితో పాటు సాంకేతిక ఆధారాలను బట్టి ముందుకు వెళ్లిన అధికారులు చోరీ కేసుకు సంబంధించి కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. దీంతో ఈ నేరానికి ఒడిగట్టిన వాళ్లు చిక్కారు. పోలీసుల విచారణలో చోరీ సొత్తులో కొంత నగరంలోని గోషామహల్ ప్రాంతంలో విక్రయించినట్లు వీళ్లు బయటపెట్టారు. దీంతో ఇద్దరు నిందితులను తీసుకుని స్థానిక పోలీసులు మంగళవారం గోషామహల్‌కు వచ్చారు. తాము చోరీ సొత్తు విక్రయించిన దుకాణం చూపిస్తున్నట్లు నటించిన ఇద్దరు నిందితులు పోలీసు కళ్లుగప్పి ఎస్కేప్ అయ్యారు. వీరిని పట్టుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో పోలీసు సిబ్బంది ఈ విషయాన్ని ఠాణా అధికారులకు తెలిపారు. ఆ నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు రికార్డుల్లోకి ఎక్కకపోవడంతో విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అదే జరిగితే విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని భావించారు. ఆ డివిజన్, జోన్‌లతో పాటు కమిషనరేట్‌కు చెందిన ఉన్నతాధికారులకు మాత్రం ఠాణా సిబ్బంది ఈ ఎస్కేప్‌పై సమాచారం ఇచ్చారు. ఆ అధికారుల ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన ప్రత్యేక విభాగం అధికారులు సైతం ఈ నిందితుల కోసం మూడు రోజులుగా ముమ్మరంగా గాలిస్తున్నారు.

స్పెషల్ డ్రైవ్ అంతంతే..

- నామమాత్రంగా ధరణి దరఖాస్తుల పరిష్కారం
- ఇప్పటి వరకు 3,622 మాత్రమే క్లియర్
- ఆశించిన స్థాయిలో ముందుకు సాగని ప్రక్రియ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ధరణి దరఖాస్తుల పరిష్కారం కోసం ప్రభుత్వం ఈ నెల 1 నుంచి చేపట్టిన స్పెషల్ డ్రైవ్ జిల్లాలో ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. మండలాల వారీగా తహసీల్దార్, డిప్యూటీ తహసిల్దార్లు రెండు బృందాలుగా ఏర్పడి దరఖాస్తులను పరిష్కరిస్తున్నారు. మెజార్టీ దరఖాస్తులు నిషేధిత జాబితా, కోర్టు కేసులకు సంబంధించినవే కావడంతో అధికారులు వాటిని ముట్టుకునేందుకు సాహసించడం లేదు. దీంతో ఆయా దరఖాస్తులన్నీ పరిష్కారానికి నోచుకోలేక పోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ధరణి పోర్టల్‌లో మొత్తం 39,076 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, వీటిలో ఇప్పటి వరకు 3,622 మాత్రమే క్లియర్ చేశారు. మరో 35,454 దరఖాస్తులు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ దరఖాస్తుల పరిష్కారం కోసం ప్రభుత్వం ఇచ్చిన గడువు శనివారంతో ముగియనుంది. జిల్లా రెవెన్యూ అధికారులు వారం రోజులుగా ఇదే పనిగా దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. రికార్డుల్లోని భూములకు.. క్షేత్రస్థాయిలోని పరిస్థితులకు భిన్నంగా ఉండటంతో వీటిని ముట్టుకునేందుకు వెనుకాడుతున్నట్లు తెలిసింది. ఇక మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 9,419 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, వీటిలో ఇప్పటి వరకు 676 మాత్రమే పరిష్కరించారు. వికారాబాద్ జిల్లాలో 14,501 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, వీటిలో ఇప్పటి వరకు 4,324 దరఖాస్తులు పరిష్కరించారు. మెజార్టీ దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉండటంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు.

పత్రీజీ సేవలు చిరస్మరణీయం



పత్రీజీ శక్తిస్థల్ నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న విజయభాస్కర్‌రెడ్డి, దశరథ్ నాయక్

- మహేశ్వర మహాపిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి

కడ్తాల్: ధ్యానమయ ప్రపంచానికి ధ్యాన గురువు దివంగత బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని, మహేశ్వర మహాపిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. శుక్రవారం వారు మహేశ్వర మహాపిరమిడ్ ప్రాంగణంలో ‘పత్రీజీ శక్తిస్థల్’ నిర్మాణ పనులకు ధ్యానులతో కలసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధ్యానానికి మారుపేరుగా నిలిచిన పత్రీజీ మనమధ్య లేకపోవడం బాధకరమని విచారం వ్యక్తం చేశారు. ధ్యానం ఉన్నంత వరకు పత్రీజీ మనతోనే ఉంటారని ధ్యాన జగత్తుకు పత్రీజీ చేసిన సేవలు ఎప్పటికి నిలిచిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, పత్రీజీ కూతురు పరిమిళపత్రి, ట్రస్ట్ సభ్యులు సాంబశివరావు, దామోదర్‌రెడ్డి, శ్రీరాంగోపాల్, చంద్రశేఖర్, మాధవి, నీరాజరెడ్డి, లక్ష్మీ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

90 రోజులు.. 10 కోట్ల మంది మహిళలు

‘మహాలక్ష్మి పథకం’ అమలులో గ్రేటర్ ఆర్టీసీ టాప్‌గేర్

- రోజుకు 10 లక్షల మందికి పైగా మహిళా ప్రయాణికులు
- వంద శాతం ఆక్యుపెన్సీతో పరుగులు తీస్తున్న సిటీ బస్సులు



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో మహాలక్ష్మి పథకం టాప్ గేర్‌లో పరుగులు తీస్తోంది. సిటీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 10 కోట్ల మందికి పైగా మహిళలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవడం విశేషం. ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ గతేడాది డిసెంబర్ 9వ తేదీన మహాలక్ష్మి ఉచిత ప్రయాణ సదుపాయాన్ని ప్రవేశపెట్టింది. మహాలక్ష్మి పథకం అమలుకు ముందు ప్రయాణికులు లేక సిటీ బస్సులు వెలవెలపోయాయి. ఈ పథకం అమల్లోకి వచ్చిన మొదటి రోజు నుంచే నగరంలోని అన్ని రూట్‌లలో ప్రయాణికుల రద్దీ అనూహ్యంగా పెరిగింది.

గతంలో 4 లక్షల మందే..

ప్రతి రోజు సుమారు 10 లక్షల మందికి పైగా మహిళలు సిటీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. గతంలో కేవలం 4 లక్షల మంది సిటీ బస్సుల సేవలను వినియోగించుకొనేవారు. వారిలో విద్యార్థినులే ఎక్కువ. ఆ తర్వాత ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పని చేసే ఉద్యోగులు, చిన్నచిన్న వ్యాపారాలు చేసుకొనే మహిళలు ఎక్కువగా ఉండేవారు. మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తరువాత అన్ని వర్గాల మహిళలకు సిటీ బస్సు చేరువైంది. మెట్రో లగ్జరీ వంటి బస్సుల్లో ప్రయాణం చేసే మహిళలు సైతం ఉచిత ప్రయాణాన్ని దృష్టిలో ఉంచుకొని ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌ల వైపు మళ్లారు. దీంతో ఈ రెండు కేటగిరీలకు చెందిన బస్సుల్లో ఒక్కసారిగా ఆక్యుపెన్సీ వంద శాతం దాటింది. సాధారణంగా ఉదయం, సాయంత్రం మాత్రమే కనిపించే ప్రయాణికుల రద్దీ కొంతకాలంగా అన్ని వేళల్లోనూ ఉంది. ‘ఆటోలు, క్యాబ్‌లు వంటి వాహనాలను వినియోగించే మహిళలు కూడా సిటీ బస్సుల్లోకి మారారు. ఇప్పుడు బస్సుల సంఖ్య పెరిగితే తప్ప ప్రయాణికుల డిమాండ్‌ను చేరుకోలేని పరిస్థితి నెలకొంది’ అని ఆర్టీసీ అధికారి ఒకరు తెలిపారు. ప్రతి రోజు 10 లక్షల మంది ప్రయాణికుల చొప్పున మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు 90 రోజుల్లో సుమారు 10 కోట్ల మందికి పైగా మహిళలు ప్రయాణం చేసినట్లు ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో గతంలో రోజుకు సుమారు 15 లక్షలు మాత్రమే ఉన్న ప్రయాణికుల సంఖ్య ఇప్పుడు 25 లక్షలు దాటింది. అందులో 10 లక్షల మంది మహిళలే కావడం గమనార్హం. ప్రయాణికుల రద్దీ గణనీయంగా పెరగడంతో సిటీ బస్సుల్లో సీట్ల కొరత పెద్దసవాల్‌గా మారింది. మహిళల కోసం కేటాయించిన సీట్లతో పాటు, ఇతర సీట్లను కూడా మహిళలే ఆక్రమించుకోవడంతో పురుషులు, వయోధికులకు ‘స్టాండింగ్ జర్నీ’ భారంగా మారింది. మరోవైపు ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పురుషుల కోసం ప్రత్యేక బస్సులను నడిపేందుకు ఆర్టీసీ సన్నాహాలు చేసింది. ఒకటి, రెండు రూట్లలో నాలుగైదు ట్రిప్పులు ప్రయోగాత్మకంగా నడిపారు. కానీ అంతగా స్పందన లేకపోవడంతో ‘జెంట్స్ స్పెషల్’ బస్సుల ప్రతిపాదనను విరమించుకొన్నారు.

అరకొర బస్సులే...

గతంలో రోజుకు రూ.కోటి నష్టంతో నడిచిన బస్సులు ఇప్పుడు లాభాల బాట పట్టాయి. మహిళా ప్రయాణికుల చార్జీలను ప్రభుత్వమే చెల్లిస్తున్న దృష్ట్యా నష్టాలను అధిగమించేందుకు ఆర్టీసీకి అవకాశం లభించింది. కానీ ప్రయాణికుల డిమాండ్ మేరకు బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. హైదరాబాద్ మహానగరం విస్తరణకు అనుగుణంగా సిటీ బస్సుల సేవలు విస్తరించుకోవడం లేదు. ట్రిప్పుల సంఖ్య గణనీయంగా తగ్గింది. సాధారణంగా నగర శివార్ల నుంచే వివిధ రకాల పనులపైన మహిళలు, అన్ని వర్గాల ప్రయాణికులు నగరంలోకి రాకపోకలు సాగిస్తారు. కానీ నగర శివార్ల నుంచి తగినన్ని బస్సులు అందుబాటులో లేవు. సుమారు 2500 బస్సులు మాత్రమే సిటీలో తిరుగుతున్నాయి. మెట్రోలగ్జరీ, మెట్రో డీలక్స్ వంటి బస్సులను మినహాయిస్తే కనీసం 2000 బస్సులు కూడా అందుబాటులో లేవు. మరోవైపు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని వినియోగించుకుంటున్న మహిళల్లో 70 శాతం మంది నగర శివార్ల నుంచే ప్రయాణం చేస్తున్నారు.బెంగళూర్ వంటి మెట్రో నగరాల్లో 6 వేలకు పైగా సిటీ బస్సులు నడుస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిని విస్తరించేందుకు ప్రభుత్వం తాజాగా ప్రతిపాదనలు చేసింది. ఈ క్రమంలో గ్రేటర్ ఆర్టీసీ కూడా కనీసం రెండు రెట్లు విస్తరించాల్సి ఉంది.

11న లయన్స్ క్లబ్ రీజియన్ సమావేశం

ఆమనగల్లు: హైదరాబాద్ కర్మన్‌ఘాట్‌లోని ఏపీ ఆర్ గార్డెన్స్‌లో ఈనెల 11న లయన్స్‌క్లబ్ రీజియన్ సమావేశం నిర్వహించనున్నట్లు రీజియన్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఆమనగల్లు లయన్స్ క్లబ్ పీఆర్‌ఓ పాషా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్లు నరేందర్‌రెడ్డి, చెన్నకిషన్‌రెడ్డి, మల్టీపుల్ వైస్ చైర్మన్ జూలూరి రఘు తదితరులు హాజరవుతారని చెప్పారు. సమావేశానికి లయన్స్‌క్లబ్ రీజియన్ పరిధిలో ఉన్న పది లయన్స్‌క్లబ్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు పాల్గొనాలని కోరారు.

తొమ్మిది మంది జూదరుల అరెస్టు

పహాడీషరీఫ్: పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని పహాడీషరీఫ్ పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.26,500 నగదు, తొమ్మిది సెల్‌ఫోన్లు, రెండు సెట్ల పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మామిడిపల్లికి చెందిన జంగయ్య(46), రాజు(38), జగన్(48), శ్రీనివాస్ గౌడ్(32), మురళి(45), సిద్దులు(30), మల్లేష్(40), చెన్నయ్య(49), ఆశీర్వాదం(50) శుక్రవారం మధ్యాహ్నం మామిడిపల్లి శివారులోని అలీగూడంలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ మధు తన బృందంతో కలిసి దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. వీరిపై గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు.

శివోహం పెయింటింగ్ పోటీలు ప్రారంభం

మణికొండ: మహాశివరాత్రిని పురస్కరించుకుని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని సెక్రటేరియట్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న శివోహం పెయింటింగ్ పోటీలను కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డి.మనోహర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనలోని భక్తిని అనేక రకాలుగా చూపించవచ్చని అందులో భాగంగానే చిత్రకారులు పెయింటింగ్ రూపంలో చూపుతారన్నారు. వారిలోని కళను వెలుగులోకి తెచ్చి ప్రోత్సహించేందుకే యేటా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మొదటి రోజు 32 మంది కళాకారులు పాల్గొన్నారని, ఆదివారం వరకు కొనసాగుతాయన్నారు. చివరి రోజు ఉత్తమ పెయింటింగ్‌లకు బహుమతులను ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం నాయకులు రాంప్రతాప్, ఎస్. రామకృష్ణ, శివరామకృష్ణతో పాటు పెద్ద ఎత్తున కాలనీవాసులు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న మహిళలు

ముంచుకొస్తున్న గడువు

పీఏసీఎస్ రుణాల చెల్లింపునకు 30 తుదిగడువు

- రూ.49 కోట్ల బకాయిలకు గాను వసూలైంది రూ.4 కోట్లే
- మొండిబకాయిదారులకు నోటీసులు ఇస్తున్న అధికారులు
- స్పందించని వారి ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరిక

యాచారం: పీఏసీఎస్‌లో రుణాలు పొందిన రైతు లు బకాయిలు చెల్లించాలని అధికారులు కోరుతున్నారు. ఈనెల 30లోపు చెల్లించకపోతే అపరాధ రుసుం కట్టాల్సి వస్తుందని యాచారం పీఏసీఎస్ అధికారులు రైతుల వద్దకు వెళ్లి వివరిస్తున్నారు. ఓవైపు వసూలు లక్ష్యం గడువు ముంచుకొస్తుండటంతో అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. నిర్ణీత గడువులోపు కనీసం 60 శాతం బకాయిలు సేకరించని వారిపై చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు చెప్పడంతో క్షేత్రస్థాయిలో తిరుగుతూ రైతులను బతిమాలుతున్నారు.

రూ.70 కోట్లకు పైగా పంపిణీ..

యాచారం పీఏసీఎస్(ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం)లో 2008 నుంచి 2022 వరకు 3,500 మందికి పైగా రైతులు దీర్ఘకాలిక రుణాల కింద రూ.70 కోట్లకు పైగా రుణాలు పొందారు. వీరంతా పౌల్ట్రీలు, డెయిరీ ఫాంలు, గొర్రెలు, మేకలు కొనుగోలు చేసి జీవనోపాధి పొందుతున్నారు. లోన్ తీసుకున్న సమయంలో రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకాలు తాకట్టు పెట్టి ఒక్కొక్కరు సుమారు రూ.5 లక్షలకు పైగా రుణాలు పొందారు. వీరిలో కొంతమంది ఏటా మార్చి 30లోపు క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లిస్తుండగా మరికొంత మంది నోటీసులు ఇచ్చినా స్పందించడం లేదు.

టార్గెట్ రూ.27 కోట్లు

మార్చి 30లోపు అధికారులు కనిష్ఠంగా రూ.27 కోట్ల బకాయిలు వసూలు చేయాల్సి ఉంది. టార్గెట్ గడువు దగ్గర పడుతున్నప్పటికీ రుణాల చెల్లింపుల్లో చలనం కనిపించడం లేదు. దీంతో అధికారుల్లో టెన్షన్ నెలకొంది. రెండు, మూడు నెలలుగా గ్రామాల్లో తిరుగుతున్నప్పటికీ కేవలం రూ.4 కోట్లు మాత్రమే వసూలు చేయగలిగారు. దీర్ఘకాలిక రుణాలు పొందిన వారిలో తుమ్మలోనిగూడ, చింతపట్ల, నల్లవెల్లి, చౌదర్‌పల్లి, నక్కర్తమేడిపల్లి, మంతన్‌గౌరెల్లి, యాచారం, మొండిగౌరెల్లి, మల్కీజ్‌గూడ, గునుగల్, చింతుల్ల తదితర గ్రామాల రైతులు అధికంగా ఉన్నారు. బకాయిదారుల్లో సైతం వీరే ముందువరుసలో కనిపిస్తున్నారు.



యాచారం పీఏసీఎస్ కార్యాలయం

స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం



బకాయిలు చెల్లించేందుకు మార్చి 30 తుది గడువు. మూడు నెలలుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. రైతుల ఇళ్లు, పొలాల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండాపోతోంది. రూ.49 కోట్లకు గానూ కేవలం రూ.4 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. మొండి బకాయిదారుల ఆస్తుల జప్తునకు ఉన్నతాధికారులకు వివరాలు అందజేస్తాం. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలుంటాయి.

– నాగరాజు, సీఈఓ, యాచారం పీఏసీఎస్

అస్తుల జప్తునకు రంగం సిద్ధం..

యాచారం పీఏసీఎస్‌లో 2008 నుంచి రైతులు పొందిన దీర్ఘకాలిక రుణాలు అపరాధ రుసుంతో కలిసి రెట్టింపయ్యాయి. 1,323 మంది రూ.49 కోట్ల వరకు రుణాలను పొందారు. ప్రస్తుతం కేవలం 300 మందికి పైగా రైతులు మాత్రమే రూ.4 కోట్ల వాయిదా బకాయిలు చెల్లించారు. ఇంకా 1,023 మంది రైతులు 45 కోట్ల బకాయిలు చెల్లించాలి. ఈ పక్షం రోజుల్లో వాయిదా బకాయిలు చెల్లిస్తే సరి లేదంటే మార్చి 30 తర్వాత మొండి బకాయిదారులకు నోటీసులు ఇచ్చి తాకట్టు పెట్టిన అస్తుల జప్తునకు అధికారులు రెడీ అవుతున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో తిరిగినా రైతుల నుంచి స్పందన లేకపోవడం, మార్చి 30లోపు చెల్లిస్తామనే భరోసా ఇవ్వకపోవడం అధికారులు సీరియస్‌గా ఉన్నారు. రైతులు బకాయిలు చెల్లించకపోతే మాకేంటి నష్టం..? రుణం కోసం మార్టిగేజ్ చేసిన వ్యవసాయ భూములను వేలం వేయడం కోసం హెచ్చరిక నోటీసులు ఇచ్చి జప్తు చేసుకుంటాం అంటున్నారు.

పైసలిస్తేనే ఫైలు కదిలేది

- ఆర్‌ఓఆర్, పహాణీలకు డబ్బు డిమాండ్
- ఆర్మీ జవాన్ వద్ద డబ్బులు గుంజిన కొందుర్గు రెవెన్యూ సిబ్బంది
- సోషల్ మీడియాలో వీడియోలు వైరల్

కొందుర్గు: పైసలు ఇస్తేనే ఫైలు ముందుకు కదిలేది అన్న చందంగా మారింది కొందుర్గు తహసీల్దార్ కార్యాలయం పనితీరు. ఓ ఆర్మీ జవాన్ వద్దనే దర్జాగా డబ్బులు డిమాండ్ చేసిన రెవెన్యూ సిబ్బంది.. రైతులను ఎలా పీడిస్తారో అనుమానం అక్కర్లేదంటూ మండల వాసులు ఆరోపిస్తున్నారు. భూ సంబంధిత రికార్డులు, పహాణీలు, ఆర్‌ఓఆర్ తదితర ధృవపత్రాలు కావాలంటే మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలి. మీసేవలో చలాన్ కట్టాలి. వారం రోజుల్లో సదరు పత్రాలివ్వాలి. కానీ ఈ కార్యాలయంలో అటువంటి నిబంధనలు ఏవి ఉండవని.. అధికారులకు డబ్బులు ఇస్తే వెంటనే సదరు పత్రాలు ఇస్తారని మండల వాసులు చర్చించుకుంటున్నారు.

ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో రికార్డులు..

కొందుర్గు తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే ఓ రికార్డు అసిస్టెంట్ తరుచూ షాద్‌నగర్ ఆర్‌డీఓ కార్యాలయానికి వెళుతుంటాడు. ఆర్‌డీఓ డ్రైవర్‌గా వెళ్లాడని ఇక్కడి అధికారులు చెబుతుంటారు. రికార్డు గదిలో కొందుర్గుకు చెందిన ఓ ఉద్యోగి రికార్డుకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలిస్తూ డబ్బు వసూలు చేస్తాడనే ఆరోపణలున్నాయి. ఆ డబ్బులు అధికారులు తీసుకుని పహాణీ, ఆర్‌ఓఆర్ తదితర రికార్డులు ఇస్తున్నట్లు సమాచారం.

తాజాగా రూ.40 వేలు డిమాండ్

విశ్వనాథ్‌పూర్ గ్రామానికి చెందిన అశోక్ రెడ్డి జనవరిలో తన భూమికి సంబంధించిన పహాణీ, ఆర్‌ఓఆర్ కావాలని జనవరిలో దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవలే తిరిగి కార్యాలయానికి వెళ్లి రికార్డు సెక్షన్‌లో ఆరా తీశారు. పేపర్లు ఇంకా సిద్ధమవ్వలేదని.. డబ్బులు ఇవ్వాల్సి వస్తుందని సమాధానం ఇచ్చారని బాధిత రైతు ఆర్మీ పోలీసు అశోక్ రెడ్డి సెల్ఫీ వీడియో సోషల్ మిడియాలో వైరల్ అవుతోంది. హేమంత్ ఖాతాకు ఫోన్‌పే యాప్ ద్వారా రూ.9వేలు, కొంత నగదు ఇచ్చిన వీడియో చర్చనీయాంశంగా మారింది.



కొందుర్గు తహసీల్దార్ కార్యాలయం

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

పోచారం: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ బి.రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అన్నోజిగూడలోని రాజీవ్ గృహకల్ప కాలనీకి చెందిన అడెపు హేమంత్(24) కూరగాయల వ్యాపారి. కూరగాయలు అమ్మి గురువారం రాత్రి ఇంటికి వచ్చి అప్పులైనట్లు భార్య శృతితో చెప్పి నిద్రకు ఉపక్రమించాడు. శుక్రవారం ఉదయం మార్కెట్‌కు బయలుదేరిన హేమంత్ ఐదు నిమిషాల్లోనే ఇంటికి తిరిగి వచ్చి గదిలోకెళ్లి గొళ్లెం పెట్టుకున్నాడు. తలుపు తెరిచేందుకు శృతి విఫలయత్నం చేసి ఇతరుల సాయంతో తలుపు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా హేమంత్ చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు అతడిని ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే హేమంత్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్యతో పాటు 4 నెలల కొడుకు నాని ఉన్నాడు. భువనగిరిలోని శివాజీనగర్ వీరి స్వస్థలమని తెలిసింది.

టీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో సంబరాలు



రాజేంద్రనగర్ డీఎం శ్రీనాథ్‌ను సత్కరిస్తున్న ఎండీ సజ్జనార్

రాజేంద్రనగర్: టీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో కళాభవన్‌లో గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్ 2023–24 సంబరాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉత్తమ సేవలందించి ప్రథమ స్థానంలో నిలిచిన రాజేంద్రనగర్ డిపో మేనేజర్ ఎం.శ్రీనాథ్ సంస్థ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా మెమోంటో, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. ఈ అవార్డు తన బాధ్యతను మరింతగా పెంచిందన్నారు.

మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి

రాజకీయ శాస్త్రవేత్త ప్రొ.జోయాహసన్

రాయదుర్గం: మహిళా సాధికారత లేకుండా సమాజాభివృద్ధి సాధ్యం కాదని ప్రముఖ రాజకీయ శాస్త్రవేత్త జేఎన్‌యూ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్స్ మాజీ డీన్ ప్రొఫెసర్ జోయాహసన్ పేర్కొన్నారు. శుక్రవారం గచ్చిబౌలిలోని మనూ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఆరవ అంతర్జాతీయ ఉర్దూ సోషల్ సైన్స్ కాంగ్రెస్‌లో భాగంగా ప్రత్యేక సింపోజియం నిర్వహించారు. ఈ సందర్భంగా 'కౌంట్ హర్ ఇన్: జెండర్ ఈక్వాలిటీ త్రూ ఎంపవర్‌మెంట్' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగించారు. మహిళలను ప్రోత్సహిస్తే తమ సత్తా చాటుతారని అన్నారు. ఏఎంయూ డైరెక్టర్ ట్రిబాక్ న్యూఢిల్లీ మాజీ ప్రొఫెసర్ అబ్దుల్ మతిన్ మాట్లాడుతూ గ్రామీణ పేదరిక నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, లింగ సమానత్వం ద్వారా మహిళా సాధికారత జరుగుతుందన్నారు. హెచ్‌సీయూ సెంటర్ ఫర్ విమెన్స్ స్టడీస్, హిస్టరీ విభాగం ప్రొఫెసర్ రేఖా పాండే మాట్లాడారు. కార్యక్రమంలో జేఎన్‌యూ ఎకనామిక్స్ ప్రొఫెసర్ అరుణ్‌కుమార్, మనూ ఓఎస్‌డీ–1 ప్రొఫెసర్ షుగుప్తా షాహీన్, మనూ ఎకనామిక్స్ గౌరవ ప్రొఫెసర్ అమితాబ్ కుందు, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడు ప్రొ.అమీరుల్లాఖాన్, మాజీ వీసీ ప్రొ. రహమతుల్లా, సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ ఫరీదా సిద్దిఖీ, కో కన్వీనర్ డాక్టర్ సయ్యద్ నజీవుల్లా, ముస్తాజాబ్ ఖతీర్ ప్రసంగించారు.



ఉర్దూ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న అతిథులు

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

గచ్చిబౌలి: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గచ్చిబౌలి పోలీసులు గుర్తించారు. ఈ నెల 4వ తేదీ రాత్రి 9.30 గంటల సమయంలో గోపన్‌పల్లిలోని వైన్‌షాపు వెనుక సిట్టింగ్ ప్రదేశంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడు ఉత్తరప్రదేశ్‌కు చెందిన సర్వశ్రీ కుమార్(55). ఎన్‌టీఆర్‌నగర్‌లో నివాసం ఉంటూ స్థానికంగా ఐస్‌క్రీం బండి నిర్వహిస్తున్నాడు. వైన్ షాపులో మద్యం కొనుగోలు చేసి తాగి పడిపోయాడు. వైన్ షాపు నిర్వాహకులు గమనించి గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దర్జాగా ఇసుక అక్రమ రవాణా

పట్టించుకోని అధికారులు

యాలాల: మండల పరిధిలోని బెన్నూరు సమీపంలో కాగ్నా నది నుంచి శుక్రవారం దర్జాగా ఇసుక అక్రమ రవాణా సాగింది. కాగ్నా నది పంపుహౌస్ సమీపంలో నాలుగు ట్రాక్టర్లలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఇసుకను తోడేశారు. ట్రాక్టర్లలో తాండూరు, అగ్గనూరు రూట్లలో ఇసుకను తరలించుకుపోయారు. ఈ విషయాన్ని గమనించిన స్థానిక రైతులు మీడియాకు సమాచారం ఇచ్చారు. కాగ్నా నది నుంచి ఇసుకను అటు పర్మిట్ల పేరుతో సెలవు రోజున అక్రమంగా తరలిస్తున్న మైన్స్, రెవెన్యూ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ రవాణా జరుగుతున్న విషయాన్ని రెవెన్యూ అధికారులకు ఫోన్‌లలో సమాచారం ఇద్దామనుకుంటే అధికారులు స్పందించడం లేదని స్థానిక యువకులు వాపోతున్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

పెద్దేముల్: మండలంలో అక్రమ ఇసుక దందా పెట్రేగిపోతుంది. ప్రభుత్వం అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా తరలిస్తున్నారు. గురువారం రాత్రి అనుమతి లేకుండా ఆరు ఇసుక ట్రాక్టర్‌లను పట్టుకొని పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌ఐ గిరి శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రెగొండి శివారులోని వాగుల నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా ఆరు ఇసుక ట్రాక్టర్లు లోడ్ చేసి వెళుతుండగా మంబాపూర్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఏలాంటి అనుమతులు లేకపోవడంతో వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ట్రాక్టర్‌ల యజమానులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.